# సురాజ్యం

## ఉద్యమ పత్రిక

4

2012 అక్టోబర్





# సురాజ్యం - ప్రతిజ్ఞలు, సత్యాగ్రహాలు



# సురాజ్య ఉద్యమం
# భవిష్యత్ కార్యక్రమాలు

**మిత్రులకు,**

2012 అక్టోబర్ 4

సురాజ్య ఉద్యమం వివిధ పట్టణాలకు విస్తరింపజెయ్యడంలో సురాజ్య ఉద్యమ స్టీరింగ్ కమిటీ సభ్యులు విశేషంగా కృషిచేశారు. ఇప్పటివరకు 55 రౌండ్‌టేబుల్ సమావేశాలు జరిగాయి. రాజకీయాలకు అతీతంగా వివిధ తరగతుల ప్రముఖులు, పౌరసంస్థలు, పార్టీల ప్రతినిధులు ఇందులో భాగస్వాములవుతున్నారు. పట్టణ సురాజ్య కమిటీలలో బాధ్యతలు తీసుకుంటున్నారు. ఈ పట్టణ సురాజ్య కమిటీలు నిరంతరం నిర్వహించుకోడానికి తగిన కార్యక్రమాలను అందించాల్సి ఉంది. సురాజ్య ఉద్యమ సారధ్య కమిటీలో నిర్ణయించిన కార్యక్రమాలను క్రోడీకరించి పట్టణాలలో సాగించుకోడానికి వీలుగా “మన ఊళ్లో సురాజ్యం” కార్యక్రమాలను పంపుతున్నాము.

సమాచారనిమిత్తం మీకు దాని ప్రతిని ఈ లేఖతో జోడించటం జరుగుతున్నది. మీ స్ఫూర్తితో తొలిదశలో పట్టణాలలో అర్థవంతమైన కార్యక్రమాలు జరుగుతాయని, వాటిద్వారా సురాజ్య నిర్మాణానికి కావలసిన చైతన్యం పౌరులలో పెరుగుతుందని ఆశిస్తున్నాను.

అభినందనలతో.....

భవదీయ

**డా॥ జయప్రకాష్ నారాయణ్**

సురాజ్య ఉద్యమం

# మన ఊళ్లో సురాజ్యం

## కార్యక్రమాల నిర్వహణకు కొన్ని మార్గదర్శకాలు

2012 అక్టోబర్ 10

పట్టణ సురాజ్య ఉద్యమ కమిటీల అధ్యక్షులకు, కన్వీనర్లకు

**పట్టణ సురాజ్య ఉద్యమ కమిటీల అధ్యక్షులకు, కన్వీనర్లకు**

### I 1. అక్టోబర్ 30న - ప్రజా మున్సిపల్ కౌన్సిల్ ఏర్పాటు (మున్సిపల్ పౌరవేదికలు)

ప్రస్తుతం మున్సిపాలిటీలలో ప్రజాప్రతినిధుల పాలన లేదు. ఎన్నికలు ఇప్పుడు జరిగే అవకాశమూ లేదు. ప్రజా సమస్యలు పట్టించుకునే ప్రజాప్రతినిధులు లేనందున సురాజ్య కమిటీ చొరవ తీసుకుని ప్రజా మున్సిపల్ కౌన్సిల్‌ను ఏర్పాటు చెయ్యాలి.

**ప్రజా మున్సిపల్ కౌన్సిల్ ఛైర్మన్ మరియు అధ్యక్షవర్గం**

– సురాజ్య ఉద్యమ కమిటీ సమావేశమై ప్రజా మున్సిపల్ కౌన్సిల్‌కు ఒక ఛైర్మన్‌తో పాటు అధ్యక్ష వర్గానికి పట్టణ సురాజ్య ఉద్యమ కమిటీ అధ్యక్షులతో పాటు మరో నలుగురైదుగురు పెద్దలను గుర్తించి, వారితో సంప్రదించి తుది జాబితాను రూపొందించుకోవాలి. ఇందులో మహిళలకు, ఇతర తరగతులకు ప్రాతినిధ్యం వుండేలా చూడండి.

**ఆహ్వానిత సభ్యులు :** ఈ ప్రజాకౌన్సిలుకు మాజీ మున్సిపల్ ఛైర్మన్‌లను, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులను మాజీ మున్సిపల్ కమిషనర్లు లేదా ఇంజనీర్లు, మేనేజర్ల వంటి వారిని ఆహ్వానిత సభ్యులుగా పెట్టుకోవాలి.

**ప్రజాకౌన్సిలర్లు :** ప్రతి వార్డుకీ ఇద్దరు సభ్యులు అందులో ఒకరు మహిళ వుండేలా ప్రజా కౌన్సిలర్లను ఏర్పాటు చేసుకోవాలి. ఆయా వార్డులలో స్థానిక సమస్యల మీద కృషి చేస్తున్న వారు, లేదా పని చెయ్యాలన్న ఆసక్తి గలవారి నుండి ఎంపిక చెయ్యాలి.

**ప్రజాగేలరీ :** మున్సిపల్ వ్యవహారాలలో ఆసక్తిగల వారిని వివిధ రంగాల ప్రతినిధుల్ని ప్రతి సమావేశానికి ప్రజాగేలరీకి ఆహ్వానితులుగా పిలుచుకోవాలి.

ప్రజాకౌన్సిల్ ఏర్పాటు తేదీని, ప్రదేశాన్ని ముందుగా నిర్ణయించి కరపత్రం ద్వారా ప్రచారం చేసి, అందరికీ ఆహ్వానాలు పంపి తొలి ప్రజాకౌన్సిల్ సమావేశం నిర్వహించి లాంఛనంగా ఈ ప్రజా మున్సిపల్ కౌన్సిల్ పేర్లు ప్రకటించాలి. ఈ ప్రజాకౌన్సిల్ బృందాన్ని రాజకీయాలకి అతీతంగా ప్రజాహిత కార్యక్రమాలు నిర్వహిస్తున్న లేదా ఆసక్తిగల వారితో ఏర్పాటు చెయ్యాలి.

### 2 . ప్రజా మున్సిపల్ కౌన్సిలు నిర్వహించే కార్యకలాపాలు

1. ప్రతి 15 రోజులకు ఒకసారి సమావేశం కావాలి.

ఉదా: ప్రతినెలా 1–15 తేదీలు లేదా మరొక తేదీలు నిర్దిష్టంగా నిర్ణయించి ప్రకటించాలి.

2. ప్రతి సమావేశంలో కనీసం ఈ క్రింది మూడు అంశాలతో ఎజెండాను రూపొందించుకోవాలి.
   1. మున్సిపాలిటీల సాధికారత సమస్యలు
      (74 రాజ్యాంగ సవరణలోని ఒక అంశంపై వివరణ – చర్చ)
   2. మన ఊళ్లో వసతులు, మానవాభివృద్ధి, సిటిజన్స్ ఛార్టర్లలో ఏదో ఒక అంశంపై నివేదిక – చర్చ
   3. ప్రజా కౌన్సిలర్లు తమ వార్డులలో సమస్యల ప్రస్తావనలు, విజ్ఞప్తులు

**3.** సమావేశంలో చర్చకు వచ్చిన సమస్యల్ని క్రోడీకరించి స్థానిక మున్సిపల్ అధికారులతో ఆ సమస్యల పరిష్కారానికి చర్చలు జరపాలి.

ముఖ్యమైన సమస్యలు వెలుగులోకి తేవడానికి మున్సిపల్ ఛైర్మన్, అధ్యక్ష బృందం, ప్రజా కౌన్సిలర్లు ఆయా ప్రాంతంలో క్షేత్రసందర్శనలు చెయ్యాలి.

**4.** ఈ ప్రజా మున్సిపల్ కౌన్సిల్ సమావేశాల నిర్వహణకు, ఎజెండా రూపొందించడానికి, చర్చకు వచ్చిన సమాచారాన్ని క్రోడీకరించడానికి, మెమోరాండాలు రూపొందించడానికి, క్షేత్ర సందర్శన ఏర్పాట్లు చెయ్యడానికి సురాజ్య కమిటీ ఒక వలంటీర్ల బృందాన్ని ఏర్పాటు చెయ్యాలి. కొంత అనుభవం గల వారిని దీనికి కన్వీనరుగా పెట్టి ఈ కార్యక్రమం సజావుగా జరగడానికి ఏర్పాట్లు చెయ్యాలి.

**అక్టోబరు 15–20 వరకు మన ఊళ్లో సురాజ్యంపై కరపత్రాలు, పోస్టర్లతో ప్రచారం, పట్టణ కూడళ్ళలో సురాజ్యం ఫ్లెక్సీలు**

**అక్టోబరు 25 వరకు తొలిదశ వలంటీర్ల నమోదు**

**వలంటీర్ల ఆసక్తినిబట్టి 5 బృందాలుగా ఏర్పాటు**

**బృందాలవారీగా వేర్వేరు శిక్షణ – గైడ్ చెయ్యగల వారితో నిర్దిష్టంగా బృందాల ఏర్పాటు**

## II నవంబర్ 8వ తేదీ - జన లోక్‌పాల్ ఏర్పాటు (మన ఊళ్లో అవినీతి)

1. సురాజ్య ఉద్యమకమిటీ సమావేశమైన పట్టణానికి ఒక జన లోక్‌పాల్ ను ఏర్పాటు చెయ్యాలి. ఇందులో 10, 11 మందిని సభ్యులుగా చేసుకోవచ్చును.
రిటైర్డ్ జడ్జీలు, సీనియర్ న్యాయవాదులు, రిటైర్డ్ పోలీసు ఉద్యోగులను భాగస్వాములను చెయ్యాలి.
వీరిలో ఒకరిని జన లోక్‌పాల్ అధ్యక్షులుగా మిగిలిన వారిని న్యాయబృందంగా ప్రకటించాలి.

2. జన లోక్‌పాల్ ప్రతి 15 రోజులకు సమావేశం అవుతుంది. (ఒక వారంలో ప్రజా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరిగితే మరో వారంలో జన లోక్‌పాల్ సమావేశం జరిగేలా తేదీలు నిర్ణయించుకోవాలి.)
ప్రభుత్వ సేవలు, పథకాలు, ఇతరత్రా అవినీతికి సంబంధించిన ఫిర్యాదులను స్వీకరిస్తుంది. ఈ సమావేశంలో వాటిపై ఫిర్యాదులను వింటుంది. అవసరమయితే బహిరంగ విచారణ నిర్వహిస్తుంది. ప్రాథమిక సాక్ష్యాధారాలున్న కేసులను నిర్ధారించి సంబంధిత నేర పరిశోధన విభాగాలకు, అధికారులకు తగిన చర్యలు నిమిత్తం పంపిస్తుంది. బాధితులకు సత్వరన్యాయం జరిగేలా సంప్రదింపులు జరుపుతుంది.

3. జన లోక్‌పాల్ బృందానికి తోడ్పాటునివ్వడానికి సురాజ్య కమిటీ ఒక వలంటీర్ల బృందాన్ని ఏర్పాటు చేసి ప్రజా ఫిర్యాదుల సేకరణకు, విచారణకు, తదుపరి చర్యలకు జన లోక్‌పాల్ తోడ్పాటునిస్తుంది.

## III ముఖ్యమైన ఇతర బృందాలు

**1. మన ఊళ్లో పౌర వసతులు :** సురాజ్య ఉద్యమ కమిటీ సమావేశమై దీనికి ఒక కన్వీనర్‌నీ వలంటీర్ల బృందాన్ని ఏర్పాటు చెయ్యాలి. తాగునీరు, పారిశుధ్యం, రోడ్లు, లైట్లు పరిస్థితిపై ఆయా వార్డు ప్రజా కౌన్సిలర్ల తోడ్పాటుతో సర్వేలు నిర్వహించి నివేదికలు రూపొందించాలి. తక్షణం స్పందించాల్సిన సమస్యలను సురాజ్య ఉద్యమ కమిటీ దృష్టికి తేవాలి. ప్రతి వార్డు స్థాయిలో 1000 రూపాయల తలసరి గ్రాంటు ఆధారంగా ఒక సూక్ష్మ ప్రణాళికను స్థానికుల భాగస్వామ్యంతో రూపొందించాలి. ప్రజా ఫిర్యాదుల బాక్స్‌లను ప్రధానమైన చోట్ల ఏర్పాటు చేసి ప్రతి రోజు వాటిని సేకరించి తగు చర్యలు నిమిత్తం మున్సిపాలిటీకి నివేదించే ఏర్పాటు చేసుకోవాలి.

**2. మన ఊళ్లో పౌరసేవలు :** సురాజ్య కమిటీ ఏర్పాటు చేసే ఈ బృందం సిటిజన్స్ ఛార్టర్ల అమలు కోసం కృషి చెయ్యాలి. వీలైన పట్టణాలలో పౌరసేవాకేంద్రాన్ని ఏర్పాటు చెయ్యాలి. అలాగే మున్సిపాలిటీకి సంబంధించి సమాచార హక్కు చట్టం ప్రకారం విధిగా వెల్లడించాల్సిన అంశాలు అందరికీ అందుబాటులోకి తేవాలి.

సకాలంలో ఫిర్యాదులు పరిష్కారం, సమాచారం అందించినప్పుడు మున్సిపల్ కమిషనర్‌నీ, బాధ్యులైన సిబ్బందినీ పూల గుచ్ఛాలతో సత్కరించండి. సకాలంలో సేవలు అందించకపోతే అందోళనా కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రకటించండి. ఈ కార్యకలాపాలు సురాజ్య కమిటీ ఆమోదంతో నిర్వహించాలి.

**3. మన ఊళ్లో మానవాభివృద్ధి :** దీని కోసం సురాజ్య కమిటీ ఒక కన్వీనర్‌నీ వలంటీర్ల బృందాన్ని రూపొందించాలి. ఈ బృందం పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలలో సిబ్బంది, వసతుల కొరతలపై సర్వేలు నిర్వహించి నివేదికలు రూపొందిస్తుంది. సురాజ్య కమిటీ ఈ సమస్య పరిష్కారానికి తగిన మెమోరాండాలు, సంబంధిత అధికారులతో చర్చలు సాగించాలి.

అలాగే ఈ బృందం ప్రభుత్వ వైద్య, ఆరోగ్య సేవలు, అంగన్‌వాడీల మీద సర్వేలు నిర్వహించి నివేదికలు రూపొందించాలి. తక్షణ సమస్యలపై సురాజ్య కమిటీ స్పందించాలి.

యువతకు ఉపాధి పథకాల అమలు శిక్షణా కార్యక్రమాల ఏర్పాట్ల పై సర్వే నిర్వహించాలి. యువతతో ప్రత్యేక రౌండ్‌టేబుల్స్ నిర్వహించి ఈ అంశాలను చర్చించాలి. పథకాలలో అవినీతి వుంటే దానిని "జన లోకాయుక్తకు" నివేదించాలి.

ఇవన్నీ సురాజ్యం పేరుతో నిరంతరాయంగా సాగించాల్సిన కార్యక్రమాలు. దీనికి వలంటీర్లు, శిక్షణ అవసరం అందుకు విస్తృత ప్రచారం చెయ్యాలి. ప్రతి కాలేజీలో, ప్రతి పౌరసేవా సంస్థలో వలంటీర్ల నమోదుకు ఏర్పాట్లు చెయ్యాలి. వలంటీర్లను పైన పేర్కొన్న విధంగా ఐదు బృందాలు చేసి వారికి నిర్దిష్టంగా కార్యక్రమాలను అప్పగించాలి.

**మన ఊళ్లో సురాజ్యం మార్చ్- విద్యార్థులతో ప్రచార కార్యక్రమం**

**'క్లీన్ డే' నవంబర్ 24 నుండి 26 వరకు (స్థానిక సభ్యులకు అనుకూలంగా వున్న ఒకరోజు జరుపుకోవచ్చు)**

## IV సురాజ్య నిధి - ఇతర వసతులు

స్థానికంగా ప్రచారానికి, సభలు సమావేశాల నిర్వహణకీ అవసరమైన నిధులను సురాజ్య కమిటీ సేకరించాలి. సురాజ్య కమిటీ, ప్రజా మున్సిపల్ కౌన్సిల్, జన లోకాయుక్తలలోని సభ్యుల నుంచి ఎంతో కొంత మొత్తం అడిగి తీసుకోవాలి. సురాజ్యఉద్యమానికి తోడ్పాటునిచ్చే దాతల నుండి ప్రతి పట్టణంలో నిధులు సేకరించుకోవాలి. వీటి జమాఖర్చుల నిర్వహణకు కోశాధికారిని ఏర్పాటు చేసుకోవాలి. జమాఖర్చులు ప్రతి సురాజ్య కమిటీ సమావేశంలో ప్రకటించాలి.

## V సురాజ్య ఉద్యమంలో యువతని, మహిళలనీ, భాగస్వాములను చెయ్యడానికి ప్రత్యేక చర్చలు

**1. విద్యార్థులు, యువతతో రౌండ్‌టేబుల్ :** వివిధ కాలేజీల నుండి విద్యార్థులను, వివిధ యువజన సంస్థల ప్రతినిధులను ఆహ్వానించి ఒక రౌండ్‌టేబుల్‌ను ప్రత్యేకంగా నిర్వహించి వలంటీర్లుగా నమోదు చేసుకోవాలి.

**2. మహిళా రౌండ్‌టేబుల్ :** మహిళా టీచర్లు, లాయర్లు, డాక్టర్లు - మహిళాసంస్థలు- పొదుపు సంఘాల నాయకులను ఆహ్వానించి మహిళలకు ఒక ప్రత్యేక రౌండ్‌టేబుల్‌ను నిర్వహించి - ఇందులో వలంటీర్ల నమోదు - వివిధ కార్యకలాపాల బృందాలలో ఆసక్తిగల వారికి బాధ్యతలు అప్పగించాలి - ప్రజా వార్డు కౌన్సిలర్లుగా ఆసక్తి వున్నవారిని గుర్తించి వారికి అవకాశం కల్పించాలి.

**సురాజ్య కమిటీ ప్రతివారం సమావేశమై ఈ కార్యకలాపాలను సమన్వయం చెయ్యాలి.**

మన ఊళ్లో సురాజ్యం ఉద్యమాన్ని మొత్తంగా సురాజ్య ఉద్యమ కమిటీయే సమన్వయం చేసి నిర్వహించాలి. అందుచేత ఇతర కమిటీలలో, వేరే వారికి ప్రాతినిధ్యం కల్పించండి. ఒకరిద్దరే అన్ని బాధ్యతలు నిర్వహించే పద్ధతి ఉండకూడదు. దీనిని విధిగా పాటించండి. ■

# సురాజ్యం కేలండర్

| తేది | కార్యక్రమాలు |
|---|---|
| అక్టోబరు 15-25 | మన ఊళ్లో సురాజ్యంపై కరపత్రాలు, పోస్టర్లతో ప్రచారం, పట్టణ కూడళ్ళలో ఫ్లెక్సీలు<br>యువత, విద్యార్థులతో రౌండ్‌టేబుల్స్ - మహిళలతో రౌండ్‌టేబుల్స్<br>తొలిదశ వలంటీర్ల నమోదు పూర్తి - ఐదు బృందాలుగా ఏర్పాటు<br>1వ బృందం : ప్రజా మున్సిపల్ కౌన్సిల్ నిర్వహణ<br>2వ బృందం : పట్టణంలో పౌర వసతులు<br>3వ బృందం : పట్టణంలో పౌర సేవలు, పౌర సేవాకేంద్రం<br>4వ బృందం : పట్టణంలో అవినీతి - జన లోకాయుక్త నిర్వహణ<br>5వ బృందం : పట్టణంలో మానవాభివృద్ధి |
| అక్టోబరు 25-30 | వలంటీర్ల బృందాలకు శిక్షణ |
| అక్టోబరు 30 | ప్రజా మున్సిపల్ కౌన్సిల్ ఏర్పాటు |
| నవంబర్ 8 | పట్టణ జన లోకాయుక్తల ఏర్పాటు |
| నవంబర్ 9-18 | ఏదో ఒకరోజు పట్టణాల్లో సురాజ్యం 'మార్చ్' - విద్యార్థులతో ప్రచార కార్యక్రమం |
| నవంబర్ 24-26 | ఏదో ఒకరోజు 'క్లీన్ సిటీ డే' విద్యార్థులతో సురాజ్యం కోసం స్వయంకృషి |

## సురాజ్య సమావేశాల వసతులకు విజ్ఞప్తి

సురాజ్య కార్యకలాపాల కోసం లయన్స్, రోటరీ, మెడికల్ అసోసియేషన్స్, రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఇతర సంస్థలకు వున్న వసతులను, హాల్స్‌ను వీటికి ఉచితంగా ఇచ్చేలా వారిని కలిసి ఏర్పాటు చేసుకోవాలి. అలాగే కరపత్రాలు, ఫ్లెక్సీలు వగైరాలకు స్పాన్సర్లను ఏర్పాటు చేసుకోవాలి.

# ఆగ్ ఆగ్ ఆగ్ ఆగ్

ప్రపంచ వనరుల భాండాగారం
పెనుముప్పన పడిపోతోందేమ్
సమిష్టి యత్నపు స్వతంత్ర్యదేశం
సుస్వరాల గళమెత్తదదేమ్

ఏలుబడికి చిరునామాఐన
వూరు బడి కళ తప్పిందేమ్
రత్నగర్భ రతనాల సీమ
రక్తపుటేరుల నెలవైనదదేమ్

జననీ జన్మ భూమంటూనే
నమ్మకద్రోహం చేస్తారేమ్
ఇసుక, ఇనుము, బొగ్గు, నీరు
రొమ్ము చీల్చి దోచేస్తారదేమ్

పేదల రక్తం చేసిన కష్టం
చీపు లిక్కరుగా మారిందేమ్
పేద ధనిక వ్యత్యాసాలను
పెంచే మంత్రమయ్యిందేమ్

రాజ్యాంగం అని రాసుకున్న
మన హక్కుల బాధ్యత మరిచామేం
వికలత్వంతో ఎదగనిచ్చి
అదే అభివృద్ధి అంటారదేమ్

ఇప్పుడుకాక ఇంకెప్పడంటూ
నేనుకాక ఇంకెవ్వరంటూ
ప్రమాద ఘంటిక మ్రోగిస్తూ
సురాజ్య ఉద్యమ మొచ్చిందోయ్

స్వరాజ్య హాలికుల సురాజ్య ఫలాలు
ప్రతి పౌరునికి చేరాలోయ్
జాతి సంపదగ యువతను పెంచి
భావి తరాలకందిన్చాలోయ్.

**వందేమాతరం..... వినూత్నశ్రుతి**

# సంప్రదాయ రాజకీయం

పసిపాపల నెత్తుకుంటారు బుగ్గలు గిల్లుతారు
ముద్దులు కురిపిస్తారు ముచ్చట్లాడుతారు
ఎన్నికల ముందు కన్పించే నాటకాల రాయుళ్ళు వీరు
వీరే.. వీరే... సంప్రదాయ రాజకీయ నేతలు

సాగునీరు, త్రాగునీరందిస్తామంటూ
మైకుల్లో వైకుంఠం చూపిస్తారు
ఎన్నికల ముందు కన్పించే మంచి మాటకారులు వీరు
వీరే.. వీరే... సంప్రదాయ రాజకీయ నేతలు

కులం, మతం లెక్కల కూడికలు వేస్తారు
ఆ కూడికలు లాభం కోసం కారుకూతలు కూస్తారు
ఎన్నికల ముందు కన్పించే కుల పిచ్చిగాళ్లు వీరు
వీరే.. వీరే... సంప్రదాయ రాజకీయ నేతలు

కరువు కాటకాలొచ్చినా కన్పించని వారు
ఎన్నికలొచ్చాయంటే యింటికొచ్చి యోగక్షేమాలడుగుతారు
ఎన్నికల ముందు కన్పించే స్వార్ధజనులు వీరు
వీరే.. వీరే... సంప్రదాయ రాజకీయ నేతలు

ఎన్నికలలో ఎంతైనా ఖర్చు పెడతారు
గెలుపే ధ్యేయంగా వ్యూహం రచిస్తారు
ఎన్నికల ఖర్చును పెట్టుబడిగా భావించే వ్యాపారులు వీరు
వీరే.. వీరే... సంప్రదాయ రాజకీయ నేతలు

ఎన్నికల ముందు యింటికొచ్చి ఆప్యాయంగా పలుకరిస్తారు
ఎన్నికలనంతరం నీవ్వు ఎవరోనన్నట్లు ప్రవర్తిస్తారు
రాజకీయ నాటకంలో రాటుదేలిన నటకిరిటీలు వీరు
వీరే.. వీరే... సంప్రదాయ రాజకీయ నేతలు

ఎటువంటి టెండర్లైనా తనవారికే కావాలంటారు
ఇరువదిపైసలు ఖర్చుపెట్టి ఎనభైపైసలు ఆనాలంటారు
దేశాభివృద్ధి ద్రోహం చేస్తున్న దేశద్రోహులు వీరు
వీరే.. వీరే... సంప్రదాయ రాజకీయ నేతలు

- నంద్యాల రామకృష్ణరాజు
7842344828

## పేరు స్వతంత్రం...పెద్ద కుతంత్రం

ఉత్సవ విగ్రహా ఊరేగింపుగ
స్థానిక పాలక వర్గాలు
శాసనసభ్యుల జమీలుగా
మారిన అసెంబ్లీ సెగ్మెంట్లు
ఓటునోటు అపవిత్ర బంధమై
చేటు నాయకుల పాలనలో
గాలి,నీరు,నేల,అడవి
అన్నీ అంగడి బొమ్మలే
ప్రజల కోర్కెలకు ప్రజల సొమ్ములే
ఉచిత వరాలు,మహిత సేవలు
మోసం,ద్రోహం,దగా,కుట్రల
అర్థరహిత ప్రజాస్వామ్యమిది
ధనస్వామ్యమిది, కులస్వామ్యమిది
మతస్వామ్యమిది, మత్తుస్వామ్యమిది
ప్రాంత స్వామ్యమిది విభ్రాంతస్వామ్యమిది
అంధస్వామ్యమిది, అజ్ఞానస్వామ్యమిది
దురాశపరుల ఉన్మత్తపెత్తనం
ఉపేక్షించి విడ్డూరం చూస్తే
కుప్పకూలు ఆకాశ హర్మ్యమిది
పేరుస్వతంత్రం... పెద్ద కుతంత్రం
విలువల పాతర విధాన సౌధం
దోపిడి రాజ్యం దొంగల భోజ్యం
కట్టు కథల కనికట్టు మాటలతో
నేతల చేతలే చెద పుట్టలు ఐతే
నీతి బాహ్యమై అవినీతి రాజ్యమై
నిర్లిప్తతతో, నిస్తేజంగా, నిర్లక్ష్యంగా
నిజ ప్రభువులు నిస్సహాయులయితే
పతనం దిశగా పరుగులు తీస్తే
నిలువరించు వారెవ్వరు
నీవు గాక ఇంకెవ్వరు
నేనుగాక మరివ్వరు
మనం గాక వేరెవ్వరు
సురాజ్యభేరి ... వినూత్నశ్రుతి

**-ఉప్పలపాటి మాచిరాజు,** రామచంద్రపురం

## సురాజ్య ఉద్యమ పాట

**పల్లవి :** చూస్తు ఉందామా చూస్తూనే ఉందామా
భరతమాత భవితకు పునాదులు వేద్దామా
ఎందరో మహనీయుల త్యాగఫలాలు
కొందరి అవినీతిపరుల పాలవుతుంటే !!చూస్తు!!

**చరణం 1 :**

కులమతాల వివక్షతలు ప్రాంతీయ పగలను పెంచి
విభజించి పాలించే విషపూరిత నాయకులు
మనిషి మనిషి మధ్యలోన అగ్గిని రాజేస్తుంటే
అంబేద్కరు బాపూజీ కలలు కల్లలవుతుంటే
నారాయణ గురు చెప్పిన నినాదంబు మారుతుంటే !!చూస్తు!!

**చరణం 2 :**

మన ఖనులు, మన భూములు మన పన్నుల డబ్బులను
రాజకీయ ముసుగుల్లో రాక్షసులై దోస్తుంటే
అడుగడున అవినీతి హద్దులు దాటేస్తుంటే
అడిగెవాడు ఎవడు లేక అరాచకం చేస్తుంటే
అన్ని తెలిసి అడగలేని అసమర్థపు మనుషులను !!చూస్తు!!

**చరణం 3 :**

తెల్ల దొరలనెదిరించి సాధించిన స్వరాజ్యంబు
నల్ల దొరలనెదిరించక స్వాహా రాజ్యంబాయే
తరతరాలు గడుస్తున్న తల ఎత్తుకు బతకలేక
ఉద్యమాలు చేసి యువత ఉద్యోగం లేదంటూ
ఉడుకు రక్తమును చల్లి ఉరికొయ్యలు ఎక్కుతుంట !!చూస్తు!!

**చరణం 4 :**

ప్రభుత్వాన్ని పన్నులిచ్చి పోషించి ప్రజలంతా
ప్రభువులుగా మన సేవలు హక్కుగ పొందుట కొరకై
ఇంటిముందు ప్రభుత్వంబు కంటిముందు పాలనకై
కదలి రండి సురాజ్యఉద్యమము లోనికి
స్వార్థ నాయకులు యేలే స్వాహా రాజ్యంబు కూల్చగ !!చూస్తు!!

**- పగడాల వెంకటేశ్వరరావు,** హైదరాబాద్

# అవినీతి అంతంతోనే అభివృద్ధి సాధ్యం

## సురాజ్య ఉద్యమంలో పాలుపంచుకోవాలి : ఎమ్మెల్యే హరీష్‌రావు

**సిద్ధిపేట**

అవినీతిని అంతం చేసినపుడే అభివృద్ధి సాధ్యమవుతుందని సిద్ధిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు చెప్పారు. స్థానిక ఎన్‌జీవో భవన్‌లో లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సురాజ్యం ఉద్యమ వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ నాయకులలో ఆశ్రిత పక్షపాతం పెరగడం వల్ల అవినీతి అంతం కావడం లేదన్నారు. ప్రభుత్వ చర్యల వల్ల బీసీలు ఉన్నత చదువులు చదవలేక వెనుదిరిగిపోయే వాతావరణం ఏర్పడిందని చెప్పారు. సురాజ్యం కోసం ప్రజలందరూ ఏకమై ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పదివేల లోపు ర్యాంకుల విద్యార్థులకే పరిమితం చేయడంతో పేద, బలహీన, వర్గాల వారు ఉన్నత చదువులకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా ఉద్యమ సంస్థ జిల్లా అధ్యక్షుడు కొర్తివాడ రాజేందర్, మునిసిపల్ మాజీ చైర్మన్ కడవెర్గు రాజనర్సు, టీఆర్ఎస్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి వేలేటి రాధాకృష్ణశర్మ, టీఆర్ఎస్ నాయకులు బాలరంగం, నముండ్ల రామచంద్రం, లోక్‌సత్తా పార్టీ జిల్లా నేత తుమ్మనపల్లి శ్రీనివాస్, అమ్మన చంద్రారెడ్డి, అలాజీపూర్ లక్ష్మీనారాయణ, ఆంజనేయులు, ఎన్‌జీవో భవన్ అధ్యక్షుడు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# సురాజ్య ఉద్యమ లక్ష్యాల ప్రజల్లోకి తీసుకెళ్ళండి

## కర్నూలు, కడప, అనంతపురం సురాజ్య కమిటీల శిక్షణలో డా॥జేపి

సురాజ్య ఉద్యమ లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్ళడానికి ఉద్యమ కమిటీలు పని చేయాలని డా॥జయప్రకాష్‌నారాయణ్ కోరారు. కర్నూలు, కడప అనంతపురం జిల్లాల నుండి వచ్చిన సురాజ్య ఉద్యమ కమిటీల రిసోర్స్‌పర్సన్‌లకి అక్టోబర్12న కొత్తపేటలోని ప్రజాస్వామ్య శిక్షణా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

అందరికీ ఎదిగే అవకాశాల కోసం సురాజ్య ఉద్యమంలో లోక్‌సత్తా పార్టీ వర్కింగ్ కమిటీ అధ్యక్షులు డి.వి.వియస్.వర్మ అన్నారు. స్థానిక ప్రభుత్వాలు, హక్కుగా పౌరసేవల చట్టం గురించి లోక్‌సత్తా రాష్ట్ర కార్యదర్శి బండారు రామ్మోహన్‌రావు వివరించారు. లోక్‌పాల్, లోకాయుక్త చట్టం, రాజకీయ, పాలనా, ఎన్నికల సంస్కరణల గురించి డా॥పి.భాస్కరరావు వివరించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ ఉపాధ్యక్షులు యస్.మనోరమ, రిసోర్స్‌పర్సన్స్ కార్తీక్‌చంద్ర, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఈ శిక్షణా కార్యక్రమంలో **కర్నూలుజిల్లా**, కర్నూలు, నంద్యాల, ఎమ్మిగనూరు, బనగానపల్లి, పత్తికొండ, నందికొట్కూర్, డోన్, ఆదోని, **కడపజిల్లా** కడప, బద్వేలు, **అనంతపురంజిల్లా** అనంతపురం, గుంతకల్, రాయదుర్గం, కదిరి పట్టణాల నుండి సురాజ్య రిసోర్స్‌పర్సన్స్ హాజరయ్యారు.

# సురాజ్య ఉద్యమ ప్రతిజ్ఞ

*సురాజ్యం కోసం సాగిస్తున్న*
*మరో స్వతంత్ర పోరాటంలో*
*నేను భాగస్వామిగా ఉంటాను*
*స్వతంత్ర సమరయోధుల త్యాగఫలాన్ని*
*రాజ్యాంగ విలువలని రక్షించుకోవడం కోసం,*
*అవినీతిని అంతం చేయడం కోసం*
*నా సర్వశక్తుల్ని ఒడ్డుతాను*
*కులం, మతం, ప్రాంతం, భాషలకు అతీతంగా*
*దేశ ఐక్యతని, సమగ్రతని నిరంతరం కాపాడుతాను*
*దేశ నిర్మాణ కార్యక్రమంలో నేను విధిగా పాల్గొంటాను*
*ప్రజాస్వామ్యంలో సురాజ్యం నా జన్మహక్కు*
*దానిని సాధించడం నా విధిగా భావించి*
*ఈ ప్రతిజ్ఞ చేస్తున్నాను*

# సురాజ్య ఉద్యమ సత్యాగ్రహం




నంద్యాల

నాడు పరాయి పాలన నుండి మనకు స్వరాజ్యం వచ్చింది కానీ, అది కొందరి స్వార్ధపరుల కారణంగా స్వాహారాజ్యంగా మారింది. అందుకే స్వరాజ్యంలో అందరూ సమానంగా ఏదగాలంటే అవినీతి లేని పాలన రావాలంటే, వ్యవస్థలో రాజకీయాల్లో సంస్కరణలు రావాలని, లంచాలు లేని ప్రభుత్వ సేవల కోసం, సుపరిపాలన పౌరహక్కుగా, సురాజ్యం మన జన్మహక్కుగా, సురాజ్య ఉద్యమంలో అందరూ పాల్గొనాలని పిలుపునిస్తూ, గాంధీజయంతి సందర్భంగా నంద్యాల సురాజ్య ఉద్యమ కమిటీ గాంధీ చౌక్‌లో గాంధీ విగ్రహం దగ్గర సత్యాగ్రహం నిర్వహించింది. డా॥శౌరిరెడ్డి ప్రజలతో సురాజ్య ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సురాజ్య ఉద్యమ కమిటీ ఉపాధ్యక్షులు శ్రీ.బి.శంకరయ్య, గాంధీజీకి పూలమాల వేసినారు. గౌరవ సభ్యులు సి.రాజమోహన్‌రావు శ్రీమతి రహేలమ్మ, కన్వీనర్, ఎస్.ఎ.మజీద్ ప్రధాన కార్యదర్శి ఎమ్.వి. సత్యనారాయణ, ఎన్.ఎ.హమీద్ కార్యదర్శి వేణుగోపాల్ నాయుదు, కె.పుల్లారెడ్డి, ప్రభాకర్, జి.వెంగళరెడ్డి, పి.విజయ్‌కుమార్, ఎస్.పి.దాస్, జి.వి.రమన్ పి.ఎన్.కృష్ణ, బి.నారాయణ, ఆర్.కె. చైతన్య, హరినాధ్‌రెడ్డి, ఆర్.మధుసూధన్, సి.సత్యరాజు తదితరులు పాల్గొన్నారు.

# సురాజ్య ఉద్యమంలో విద్యార్థుల చేత ప్రతిజ్ఞ



నంద్యాల

సురాజ్య ఉద్యమంలో భాగంగా ఈ రోజు వేలాదిమంది విద్యార్థులతో సురాజ్య ప్రతిజ్ఞ జరిగింది. నేషన్ కాలేజీ విద్యార్థుల చేత శ్రీ డా॥ ఇంతయాజ్ అహమ్మద్ ప్రతిజ్ఞ చేయించారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు శ్రీతాళ్లపల్లి వీరయ్య ప్రసంగించారు. మనకు స్వరాజ్యం వచ్చింది కానీ సుపరిపాలన రాలేదు. అందుకే ఇప్పుడు ఈ సురాజ్య ఉద్యమం ప్రారంభమైనది. అవినీతి రహిత సమాజంలో కోసం సాగిస్తున్న ఈ కార్యక్రమంలో ఎస్.ఎ. మజీద్ ఎన్.హనుదీ, ఎమ్.వి.సత్యనారాయణ, పి.విజయకుమార్, జి.వెంగళరెడ్డి పాల్గొన్నారు.

# స్వరాజ్యం జన్మహక్కు - సురాజ్యం పౌరహక్కు

## లోక్‌సత్తా నాయకులు బండారు రామ్మోహన్‌రావు




### డోన్

అవినీతికి కారణం రాజకీయాలని ఎన్నికలలో డబ్బు, మద్యం నిరోధించే ఎన్నికల వ్యవస్థ ద్వారానే పాలన తీరు మారుతుందన్నారు. స్థానిక ప్రభుత్వాలు బలోపేతం చేసి, గల్లీలో సమస్యలకు ఢిల్లీలో పరిష్కారాలుండ కూడదన్నారు. లంచాలు, అవినీతి లేని సుపరి పాలన కోసం మనమందరం సురాజ్య ఉద్యమంలో భాగస్వాములు కావాలని లోక్‌సత్తా నాయకులు రామ్మోహన్‌రావు పిలుపునిచ్చారు.

ఈ సమావేశానికి లోక్‌సత్తా శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. లోక్‌సత్తా నాయకులు ఓంకార్ మాట్లాడుతూ అందరికీ ఎదిగే అవకాశాలు కావాలన్నారు. విద్య, ఆరోగ్యం, ఉపాధి అందరికీ అందినప్పుడే సురాజ్యం సిద్ధిస్తుంది. డోన్ పట్టణ సురాజ్య ఉద్యమంలో తామూ పాలు పంచుకుంటామని సి.పి.ఐ. నుండి రంగనాయకులు, బిజెపి ఎస్.వెంకటరమణ, వైఎస్.ఆర్ పార్టీ శ్రీరాములు, టిడిపి పి.ఫణిరాజ్, లోక్‌సత్తా నాయకులు ఆకెపోగు రంజిత్‌కుమార్ డెవిడ్‌లు తెలిపారు.

# సురాజ్య ఉద్యమ కార్యక్రమం




### నందికొట్కూర్

స్థానిక నందికొట్కూరు సురాజ్య కమిటీ ఇన్‌ఛార్జ్ న్యాయవాది ఎ. అనిల్ కుమార్ నాయకత్వంలో గాంధి జయంతి సందర్భంగా అక్టోబర్ 2, 2012 80 మంది సభ్యులతో నందికొట్కూరు పట్టణములోని పటేల్ విగ్రహము నుండి ర్యాలీగా కె.జి.రోడ్డులోని మహాత్మ గాంధీ విగ్రహము వరకు సభ్యులు వెళ్ళారు. పూలమాల వేసి, సత్యాగ్రహము నిర్వహించి, సుపరిపాలనకు ప్రతిజ్ఞ చేసెశారు.

# అవినీతి పరుల భరతం పట్టే చట్టం రావాలి




## పత్తికొండ

దేశంలో నెలకొన్న అవినీతిని అంతమొందించడానికి ప్రతిపౌరుడు ఉద్యమబాట పట్టాలని సురాజ్య ఉద్యమనాయకుడు, లోక్‌సత్తా నియోజకవర్గ ఇన్‌ఛార్జి కె.ఆనందాచారి ప్రజలకు పిలుపునిచ్చారు. సురాజ్య ఉద్యమంలో భాగంగా స్థానిక జూనియర్ కళాశాల నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు వందలాదిమంది విద్యార్థులతో కలిసి పట్టణవీధుల గుండా ర్యాలీ నిర్వహిస్తూ నాలుగుస్తంభాల కూడలిలో మానవహారం నిర్వహించారు. విద్యార్థి దశ నుండే ప్రతి ఒక్కరు అవినీతిని నిర్మూలించడానికి నడుము బిగించాలన్నారు. సురాజ్య ఉద్యమంలో ప్రతి ఒక్కరు పాల్గొని స్వాహారాజ్యానికి అంతం పలుకుదామని పిలుపునిచ్చారు. సురాజ్యఉద్యమంలో ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థిసంఘం నాయకులు పాల్గొని మద్దతు ప్రకటించారు. ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు బాలరాజు, రామచంద్ర, సురేంద్ర, నజీర్‌తదితరులు పాల్గొన్నారు. సురాజ్య ఉద్యమనాయకులు అశోక్‌కుమార్, తిరుపాల్‌మాదిగ, నాగేంద్ర, ప్రసాద్, మస్తాన్ రంగన్న రామ్మోహన్‌రెడ్డి, హనుమంతు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# న్యాయవాదులతో పౌరవేదిక రౌండ్‌టేబుల్




## కర్నూలు

సురాజ్య ఉద్యమంలో భాగంగా ప్రజలలో చట్టాల గురించి అవగాహన కల్పించాలని సీనియర్ న్యాయవాది శ్రీరాములు అన్నారు. కర్నూలులో పౌరవేదిక ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి న్యాయవాది అనిల్ కుమార్ అధ్యక్షత వహించారు. ప్రశించేతత్వం ప్రజలలో కల్పించినప్పుడే అవినీతికి అడ్డుకట్ట వేయవచ్చునని ఆయన అన్నారు. మాతృభాషలో కోర్టు వ్యవహారాలు నడవాలని శ్రీరాములు అన్నారు. టైమ్స్ ఇనిస్టిట్యూషన్ డైరెక్టర్ మనోహర్ మాట్లాడుతూ సురాజ్య ఉద్యమ లక్ష్యాలను యువత విద్యార్థుల వద్దకు తీసుకెళ్ళడానికి తన సహకారం అందిస్తానన్నారు. రౌండ్‌టేబుల్ సమావేశానికి లోక్‌సత్తా నాయకులు బండారు రామ్మోహన్‌రావు సమన్వయకర్తగా వ్యవహరించారు. సురాజ్య ఉద్యమంలో భాగంగా పేదలకు న్యాయవాదులుగా న్యాయసహాయం చేయడానికి సిద్దంగా వున్నామని కర్నూలు బార్ అసోసియేషన్ అధ్యక్షులు రేవపాల్, కార్యదర్శి శివశంకర్‌రెడ్డి మాజీ అధ్యక్షులు రంగారవికుమార్, మల్లికార్జున్, రామకృష్ణ, వసంతకుమార్ తదితర న్యాయవాదులు పాల్గొన్నారు. లోక్‌సత్తా నాయకులు ఓంకార్, శంకర్, డేవిడ్‌లతో పాటు సురాజ్య ఉద్యమ కమిటీ కర్నూలు అధ్యక్షులు బి.ఎన్.చెట్టి, కోశాధికారి నాగరాజు, పాల్గొన్నారు.

# అవినీతి రహిత పాలనకు యువత ఉద్యమించాలి

## కర్నూలు

అవినీతి లేని పాలన కోసం. అందరికి ఎదిగే అవకాశాల కోసం సురాజ్య సత్యాగ్రహ దీక్షను నగరంలోని కృష్ణదేవరాయల విగ్రహం వద్ద సురాజ్య కమిటీ నాయకులు చేపట్టారు. సురాజ్య సమన్వయ కర్త ఎన్.జి.శంకర్ అధ్యక్షతన దీక్ష జరిగింది. ఈ సందర్భంగా సీపీఐ వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు భీమలింగప్ప మాట్లాడుతూ సుపరిపాలన పౌరహక్కు సురాజ్యం మన జన్మ హక్కు అని అన్నారు. గౌరవాధ్యక్షుడు బి.ఎన్. చెట్టి మాట్లాడుతూ అవినీతి లేని పాలన కోసం యువత ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో రామకృష్ణారెడ్డి, నాగరాజు, జయన్న డాక్టర్ పెద్దన్న, రాజ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# సురాజ్య ఉద్యమ సత్యాగ్రహం

## కదిరి

గాంధీజీ కలలు కన్న సురాజ్యం కోసం చేపట్టిన ఉద్యమంలో భాగంగా స్థానిక వేమారెడ్డి కూడలిలో కదిరి డివిజన్ ఆధ్వర్యంలో సత్యాగ్రహం చేపట్టి ప్రజల నుంచి సంతకాల సేకరణ చేశారు. ఈ సందర్భంగా సురాజ్య ఉద్యమం నాయకులు వీరాస్వామి, హేమంత్, సలీం తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వివిధ స్వచ్ఛంద సంస్థలకు చెందిన ప్రతినిధులు, ప్రజా సంఘాల వారు పాల్గొన్నారు.

## సురాజ్య ఉద్యమంపై సంతకాల సేకరణ

లోక్‌సత్తా నాయకులు సురాజ్య ఉద్యమం పై సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. విద్య, వైద్యం, రైతుల ఉత్పత్తులకు గిట్టుబాటు ధర, మహిళా సంక్షేమం గ్రామీణ ప్రాంతాలలో వివిధ సౌకర్యాలు, లంచాలు లేని పౌరసేవల హక్కు చట్టం అవినీతిరహిత పాలన కోసం కొత్త లోకాయుక్త చట్టం కొత్తతరహా ఎన్నికల వ్యవస్థకోసం చట్టం తదితర అంశాలను ప్రజానీకానికి వివరిస్తూ సంతకాల సేకరణను చేపట్టారు.

# సురాజ్యం సాధించే వరకు ఉద్యమం




## రాయదుర్గం

ప్రజలు ఆకాంక్షించే సుపరిపాలన సాధించే వరకు సురాజ్య ఉద్యమాన్ని వివిధ రూపాల్లో కొనసాగిస్తామని లోక్‌సత్తా నాయకులు బాబు పేర్కొన్నారు. స్థానిక పాత మునిసిపల్ భవనం ఎదురుగా సామూహిక సత్యాగ్రహం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మహిళా సంఘాలు, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ బతికే అవకాశం, ఎదిగే అవకాశం కల్పించే రాజకీయం కోసం సురాజ్య ఉద్యమం సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా నాయకులు అబ్దుల్లా, లోకేష్, ఎమ్మార్పీఎస్ నాయకులు కొల్లప్ప, ఏఐఎస్ఎఫ్ నాయకులు గోవర్ధన్, అనిల్, వినోద్, వన్నూరుస్వామి పాల్గొన్నారు.

# సురాజ్యంతోనే దేశ అభివృద్ధి



## అనంతపురం

లోక్‌సత్తా పార్టీ జిల్లా కార్యాలయంలో సురాజ్య ఉద్యమ పోస్టర్‌ను డా॥జె. శ్రీనాధ్ విడుదల చేశారు. ఈ కార్యక్రమములో లోక్‌సత్తా నాయకులు వన్నూరప్ప, రాయల్ కొండయ్య పాల్గొన్నారు.

అక్టోబర్ 2న మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించినారు. ఆ తర్వాత క్లాక్ టావర్ దగ్గర సత్యాగ్రహం నిర్వహించారు. డా॥ భానుకిరణ్, డా॥ జె. శ్రీనాధ్, ఓంకార్ సురాజ్య ఉద్యమ లక్ష్యాలను వక్తలందరూ ప్రజలకు వివరించారు. సురాజ్య ఉద్యమ కరపత్రాలను ప్రజలకు పంచడం జరిగింది. ఈ కార్యక్రమంలో డా॥ గేయానంద, డా॥కొండయ్య, వన్నూరప్ప, ఇస్మాయిల్, నబిరసూల్, సత్యనారాయణ, పాండురంగ, అమర్‌నాథ్, సురేష్ వెంకటలక్ష్మి, సరస్వతమ్మలు పాల్గొన్నారు.

# సురాజ్య ఉద్యమ ప్రతిజ్ఞ



## గుంతకల్లు

సురాజ్య ఉద్యమ కమిటీ ఆధ్వర్యంలో గాంధీచౌక్ వద్దకు వాణివిద్యాని కేతన విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు వాణి విద్యానికేతన్ వ్యవస్థాపకులు మల్లికార్జున రెడ్డి ఉపాధ్యాయులు, లోక్‌సత్తా నాయకులు మహమ్మద్ గౌస్ ఫోటో స్టూడియో అసోసియేషన్ నాయకులు జంగా సురేంద్ర, కె.క్రిష్ణ, కార్తీక్, మనోహర్, ఇస్మాయిల్, లాయర్ గోపాల్, హాజీ, చంద్రశేఖర్, అనిల్‌లు పాల్గొన్నారు.

# రాజ్యాంగఫలాలు అందరికీ అందాలి

## మాజీ మంత్రి అప్పల సూర్యనారాయణ



శ్రీకాకుళం

శ్రీకాకుళంలో అంబేద్కర్ విగ్రహం వద్ద యువతీ యువకులతో కలిసి సురాజ్య ఉద్యమ ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. రాజ్యాంగఫలాలు అందరికీ అందేందుకు రాజకీయాలకతీతంగా సురాజ్య ఉద్యమాన్ని చేపట్టటం హర్షణీయమని మాజీ మంత్రి గుండ అప్పల సూర్యనారాయణ అన్నారు. అవినీతి లేని పాలనకు, స్థానిక ప్రభుత్వాల సాధికారతకు సురాజ్య ఉద్యమం అవసరమని లోక్‌సత్తా నాయకులు కొత్తకోట పోలినాయుడు అన్నారు. సురాజ్య కమిటీ అధ్యక్షులు బరాటం కామేశ్వరరావు మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా నిర్వహిస్తున్న సురాజ్య ఉద్యమానికి అన్ని వర్గాల ప్రజలు పాలుపంచుకోవాలని, ఆ దిశగా, కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రజల్లోకి వెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో యువసత్తా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పంచాది రాంబాబు, ఓంశాంతి జిల్లా ప్రతినిధి, కె.ఎల్.నాయుడు, కమిటీ సభ్యులు ఎ.మల్లేశ్వరరావు, బి.గోవిందరావులు పాల్గొన్నారు.

# సురాజ్య ఉద్యమంలో అందరూ పాల్గొనాలి




భీమవరం

అక్టోబర్ 2న భీమవరం తాలూకా ఆఫీసు ఆవరణలో బాపూజీ విగ్రహానికి సురాజ్య ఉద్యమ కమిటీ సభ్యులు పూల మాలలు వేసి నివాళు లర్పించారు. పూర్వ ప్రధాని స్వర్గీయ లాల్ బహదూర్ శాస్త్రికి నివాళు లర్పించారు. సురాజ్య ఉద్యమంలో ప్రజలు, కార్యకర్తలు మరియు స్వచ్ఛంద సంస్థలు పూర్తిగా సహకారం అందించి అవినీతి అంతానికి కృషి చేయవలసిందిగా కోరారు.

ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా నాయకులు అల్లూరి సీతారామరాజు, మంతెన కృష్ణం రాజు, దంతులూరి విజయ బంగార్రాజు, ముగ్గం అలీ, శ్రీహరి రావు, ఎం.ఎస్.ఎన్. మూర్తి, ప్రసాద్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# జన చైతన్యంతోనే సురాజ్యం




చిలకలూరిపేటలో సురాజ్య ఉద్యమ సామూహిక సత్యాగ్రహం నిర్వహించారు. ఈకార్యక్రమానికి పలు స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాజకీయ, ఎన్నికల వ్యవస్థలను సంస్కరణ చేసినప్పుడే అవినీతి నిర్మూలన సాధ్యమవుతుందని చెప్పారు. ఉద్యమానికి యువత నాయకత్వం వహించాలని కోరారు. ఈ కార్యక్రమం లో డాక్టర్ కొల్లా రామ్మోహన్‌రావు, విశ్రాంత ప్రిన్సిపాల్ తోటకూర వెంకటనారాయణ, డాక్టర్ పివి సుబ్బారావు, లోక్‌సత్తా నాయకులు ఎం.భానుప్రసాద్, షేక్ జబ్బార్ మురికిపూడి ప్రసాద్, కామినేని ఆంజనేయులు, ఎం.వెంకట్రావు, సీపీఐ నాయకులు ఆరాధ్యుల రామకృష్ణ,

## చిలకలూరిపేట

పేలూరి రామారావు, సీపీఎం నాయకులు బొల్లు శంకరరావు, కాంగ్రెస్ నాయకులు నిడమానూరు సాంబశివరావు, టీడీపీ నాయకులు జమాల్‌బాషా, దంతవైద్యులు పేర్ని కృష్ణమోహన్ పాల్గొన్నారు.

# పౌర సేవల హక్కు చట్టం తేవాలి



పంచాయితీలు, మున్సిపాలిటీలు, స్థానిక ప్రభుత్వాలకు అధికారాలు విధులు బదలాయించాలని, పౌరులు కేంద్రంగా ప్రజలు నివసించే చోట పాలన ఉండాలని లోక్‌సత్తా నాయకులు జెఐ రామ్మూర్తి కోరారు. నాదెండ్ల మండలం గణపవరం గ్రామంలో మంజీరా ఆసుపత్రిలో సురాజ్య ఉద్యమ అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో రామ్మూర్తి మాట్లాడుతూ యువత సురాజ్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించాలన్నారు. సురాజ్య ఉద్యమ స్టీరింగ్ కమిటీ సభ్యులు తోటకూర వెంకట నారాయణ మాట్లాడుతూ లంచాలు, సిఫారసులు లేకుండా నిర్దిష్ట కాలంలో ప్రభుత్వ కార్యాలయాలలో సేవలు అందించాలన్నారు. అందుకోసం పౌరసేవల హక్కు చట్టం తేవాలన్నారు.

## నాదెండ్ల

### విద్యార్థుల ప్రతిజ్ఞ

సురాజ్య ఉద్యమ కన్వీనర్ మాదాసు భానుప్రసాద్ విద్యార్థులచే సురాజ్య ఉద్యమ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సాదిక్, ఖాదర్, శ్రీనివాసరావు, నరేష్, నివార్ తదితరులు పాల్గొన్నారు.

# స్వాహారాజ్యం పోయి సురాజ్యం రావాలి

## లోక్‌సత్తా నాయకులు భీశెట్టి బాబ్జీ

గజపతినగరం

స్వాహారాజ్యం పోయి సురాజ్యం రావాలని లోక్‌సత్తా నాయకులు భీశెట్టి బాబ్జీ అన్నారు. సురాజ్య ఉద్యమంలో భాగంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం పట్టణంలో భారీ ప్రదర్శన జరిగింది. అనంతరం సాయి ఫంక్షన్ హాలులో వివిధ రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సేవాసంస్థల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో సమూల మార్పులు తీసుకువచ్చి అభివృద్ధి చేయడం ద్వారానే సమాజంలో మార్పును తీసుకుని రావచ్చునని చెప్పారు. నీతివంతంగా ఎన్నికలు జరిగినప్పుడే అవినీతిని అంతం చేయవచ్చునని చెప్పారు. సురాజ్య ఉద్యమం జిల్లా కమిటీ సభ్యుడు పివివి గోపాల రాజు మాట్లాడుతూ రాజకీయాలను అసహ్యించుకునే కన్నా మార్పుతీసుకుని వచ్చేందుకు కృషి చేయాలన్నారు. ఉత్తమమైన పౌరసమాజం కోసం కృషి చేసినప్పుడే అవినీతిని నిర్మూలించవచ్చని జెవివి జిల్లా అధ్యక్షుడు జి.లక్ష్మణరావు అన్నారు. వ్యవసాయ రంగం పూర్తిగా సంక్షోభంలో ఉందని పాలకులు దృష్టి సారించాలని కోరారు. పోరాటాల ద్వారానే సమస్యలను పరిష్కరించుకోవచ్చని సిపిఐ నాయకులు ఆల్తి అప్పలనాయుడు అన్నారు. లోక్‌సత్తా నాయకులు దేవర ఈశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో టిడిపి నాయకులు సామంతుల పైడి రాజు, గజపతినగరం మండలం మాజీ ఉపాధ్యక్షుడు కొల్లా ఓడరాజు, బిజెపి నాయకులు మన్మథరావు, తిరుమల రాజు రామలింగరాజు, వివిఎస్ఆర్ జోగారావు, యువిఎస్ఎస్ వర్మ పాల్గొన్నారు.

# సురాజ్యంతోనే అవినీతిరహిత సమాజం

## పట్టణ సురాజ్య కమిటీ కన్వీనర్ దామిశెట్టి సత్యనారాయణ



అమలాపురం రౌండ్‌టేబుల్

అవినీతిరహితమైన సమాజం సురాజ్య ఉద్యమం ద్వారానే సాధ్యమవుతుందని అమలాపురం సురాజ్య కమిటీ కన్వీనర్ దామిశెట్టి సత్యనారాయణ అన్నారు. స్థానిక సత్యసాయి కల్యాణ మండపంలో జరిగిన అమలాపురం లోక్‌సత్తా సురాజ్య కమిటీ రౌండ్‌టేబుల్ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి ప్రసంగించారు. అవినీతి అంతానికి సురాజ్య ఉద్యమనే ఆయుధాన్ని ప్రజలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో నీతివంతులను ఎన్నుకోవటం ద్వారా సురాజ్య ఉద్యమానికి ప్రజలు ఊపిరి పోయాలని కోరారు. వి.సూరిబాబు, పి.రాంబాబు, వై.చంటి, ఎన్.శ్రీనివాస్, ఎల్.గణేష్ పాల్గొన్నారు.

# సురాజ్య ఉద్యమాన్ని విద్యార్థులే నడిపించాలి

## యువసత్తా రాష్ట్ర అధ్యక్షుడు పి. శివాజీరాజు

రాష్ట్రంలో పార్టీలకు అతీతంగా జరుగుతున్న సురాజ్య ఉద్యమాన్ని విద్యార్థులే ముందుకు తీసుకువెళ్లాలని యువసత్తా రాష్ట్ర అధ్యక్షుడు పొత్తూరి శివాజీరాజు కోరారు. రాజేంద్రనగర్‌లోని ప్రిజమ్ పీజీ, డిగ్రీ కళాశాలలో లోక్‌సత్తా పార్టీ యువసత్తా ఆధ్వర్యంలో సురాజ్య ఉద్యమం, సమాచార హక్కు చట్టం పై అవగాహన సదస్సు నిర్వహించారు. శివాజీరాజు మాట్లాడుతూ దేశ భవిత యువత చేతిలోనే ఉందన్నారు. రాష్ట్రంలో లోకాయుక్తను సవరించి తప్పుచేసిన వారికి తక్షణమే శిక్షపడేలా స్వయంప్రతిపత్తి గల బలమైన వ్యవస్థగా ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. అందరికీ నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం అందాలని... అప్పుడే సురాజ్యం సాధ్యమని పేర్కొన్నారు. గీతం విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ రాజశేఖర్ వర్మ విద్యార్థులకు సహచట్టంపై అవగాహన కల్పించారు. కళాశాల కరస్పాండెంట్ సత్యనారాయణ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ ఉమాబాల, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.




విశాఖపట్నం

# అవినీతి నిర్మూలనకు అందరూ కృషి చేయాలి

## లోక్‌సత్తా నాయకులు వై.డి. రామారావు

అవినీతి నిర్మూలన సురాజ్య నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. లోక్‌సత్తా ఆధ్వర్యంలో సురాజ్య ఉద్యమపై రౌండద్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వైఎన్ కళాశాల పీజీ సెమినార్ హాల్‌లో జరిగిన కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీఆర్‌కే నర్సింహాచార్యులు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో వక్తలు మాట్లాడుతూ జవాబు దారీతనాన్ని పారదర్శకతను పెంచడం ద్వారా సువరిపాలనను వీలవుతుందన్నారు. లోక్‌సత్తా నాయకులు వైడి రామారావు, జి. జానకిరామరాజు, శిరిగినీడి నాగభూషణం, అల్లూరి సీతారామరాజు, నల్లం సూర్యచంద్రరావు, మల్లుల వెంకటేశ్వర రావు, పి.బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.




నరసాపురం రౌండ్‌టేబుల్

సురాజ్య ఉద్యమ కమిటీ అధ్యక్షుడిగా డాక్టర్ దిరిశాల వెంకటేశ్వరరావు కన్వీనర్‌గా డాక్టర్ శిరిగినీడి నాగభూషణం, సభ్యులుగా బొలిశెట్టి శ్రీనివాస్, జి. సుగుణరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.